# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 09-08-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పౌరులంతా "హర్ ఘర్ తిరంగా" ఉద్యమంలో ఉత్సాహంగా పాలుపంచుకోవాలని.. 'వికసిత్ భారత్' నిర్మాణానికి పునరంకితం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు.

- ❖ దేశ ప్రజల రక్షణ కోసం భారతదేశం ఎంతదూరమైనా వెళ్తుందని "ఆపరేషన్ సిందూర్" ద్వారా ప్రపంచానికి స్పష్టం చేసిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

- ❖ అత్యంత దృఢమైన, పారదర్శకమైన, విశ్వసనీయమైన పరీక్షల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి పేర్కొన్నారు.

- ❖ ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది.

=========================

పౌరుల్లో దేశభక్తి భావనను నింపడం, జాతీయ ఐక్యతను చాటడం, సాంస్కృతిక వారసత్వాన్ని పెంపొందించడమే లక్ష్యంగా 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రారంభమైంది. 2022లో రూపుదిద్దుకున్న ఈ కార్యక్రమం ప్రస్తుతం ఐదో ఏట అడుగుపెట్టింది. దేశంలోనే అతిపెద్ద ప్రజా భాగస్వామ్య ఉద్యమాల్లో ఒకటిగా ఇది రూపాంతరం చెందింది. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ పతాకాన్ని ఎగురవేయడంతో పాటు.. దేశభక్తి, జాతీయ ఐక్యత, సాంస్కృతిక ప్రభవాన్ని చాటే కార్యక్రమాల్లో పాల్గొనాలని 'హర్ ఘర్ తిరంగా' పిలుపునిస్తోంది. 'వందేమాతరం' గేయం 150 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో ఈసారి నిర్వహిస్తున్న 'హర్ ఘర్ తిరంగా'కు ప్రత్యేక ప్రాధాన్యత చేకూరింది.

=========================

దేశ పౌరులంతా 'హర్ ఘర్ తిరంగా' ఉద్యమంలో ఉత్సాహంగా పాలుపంచుకోవాలని, `వికసిత్ భారత్` నిర్మాణానికి పునరంకితం కావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. మువ్వన్నెల జెండా దేశానికి

గర్వకారణమని, దేశం కోసం ఎల్లప్పుడూ అత్యుత్తమ సేవలు అందించేలా మనలో స్ఫూర్తిని నింపుతుందని ప్రధానమంత్రి సామాజిక మాధ్యమం వేదికగా ఈరోజు పేర్కొన్నారు. `వందేమాతరం` గేయం 150 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న తరుణంలో.. ఈ ఏడాది `హర్ ఘర్ తిరంగా` ప్రచారాన్ని వందేమాతరం స్ఫూర్తికి అంకితం చేయడం ఎంతో సంతోషకరమని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

'హర్ ఘర్ తిరంగా' ప్రచారంలో భాగంగా అండమాన్ నికోబార్ దీవుల రాజధాని శ్రీ విజయపురంలో ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా దేశ స్వాతంత్ర్యం కోసం సర్వస్వం త్యాగం చేసిన అమరవీరులకు ఆయన నివాళులర్పించారు. అనంతరం ఉప రాష్ట్రపతి మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య సంగ్రామంతో అండమాన్ నికోబార్ దీవులకు విడదీయరాని చారిత్రక సంబంధం ఉందన్నారు. దేశ స్వేచ్ఛ కోసం మన పోరాట యోధులు ఇక్కడి కారాగారాల్లో చిత్రహింసలను, ఆవేదనను అనుభవించిన పవిత్ర భూమి ఇది అని గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాత చట్టాల స్థానంలో తీసుకొచ్చిన మూడు కొత్త నేర చట్టాలు సాంకేతికత, సమయపాలన, విశ్వసనీయత ఆధారంగా రూపొందాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు నిర్ణీత వ్యవధిలో పౌరులకు వేగవంతమైన న్యాయం అందించడమే ఈ చట్టాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పుదుచ్చేరిలోని గోరిమేడు పోలీసు శిక్షణ కేంద్రం ప్రాంగణంలో ఈరోజు నిర్వహించిన కార్యక్రమంలో పుదుచ్చేరి పోలీసు రక్షక దళానికి అత్యున్నత "ప్రెసిడెంట్స్ పోలీస్ కలర్" పురస్కారాన్ని ఆయన ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ...

(వాయిస్ 21 సెకన్లు)

అనంతరం "హర్ ఘర్ తిరంగా" యాత్రను ఆయన ప్రారంభించారు. చేతుల్లో త్రివర్ణ పతాకాలను పట్టుకుని వేలాది మంది ప్రజలు ఉత్సాహంగా ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ)- వ్యవహారాలు, పనితీరుపై కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి.. ఆ శాఖ కార్యదర్శి, ఉన్నతాధికారులతో ఈరోజు కీలక సమావేశం నిర్వహించారు. సంస్థాగత యంత్రాంగాన్ని మరింత బలోపేతం చేయడం, నిర్వహణ ప్రక్రియలను క్రమబద్ధీకరించడం, విద్యార్థుల సమస్యలపై వేగంగా స్పందించేలా చర్యలు తీసుకోవడం వంటి అంశాలపై ఈ భేటీలో చర్చించినట్లు కేంద్రమంత్రి తెలిపారు. ప్రతి విద్యార్థి ఆకాంక్షలకు అనుగుణంగా అత్యంత దృఢమైన, పారదర్శకమైన, విశ్వసనీయమైన పరీక్షల వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రహ్లాద్ జోషి సామజిక మాధ్యమాల వేదికగా పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రధానమంత్రి ఆవాస్ యోజన - అర్బన్ (PMAY-U), PMAY-U 2.0 పథకాల కింద దేశవ్యాప్తంగా ఇప్పటివరకు కోటీ 25 లక్షలకు పైగా గృహాలను మంజూరు చేసినట్లు కేంద్ర గృహ నిర్మాణ, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వీటిలో ఇప్పటికే కోటికి పైగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేశామని తెలిపింది. మొత్తం 16 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆర్థికంగా బలహీన వర్గాల కుటుంబాల కోసం PMAY-U 2.0 కింద 2.09 లక్షలకు పైగా ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించింది. కేంద్ర మంజూరు, పర్యవేక్షణ కమిటీ (CSMC) సమావేశంలో గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ కార్యదర్శి సతేంద్ర సింగ్ పథకం పురోగతిపై ఈరోజు సమీక్షించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ పౌరుల రక్షణతో పాటు, సోదరీమణుల సౌభాగ్యాన్ని కాపాడేందుకు భారత్ రాజీ పడదనే సందేశాన్ని `ఆపరేషన్ సిందూర్` ప్రపంచానికి చాటి చెప్పిందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. న్యూఢిల్లీలోని బేస్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన `సిందూర్ మహా రక్తదాన్ యాత్ర` రక్తదాన శిబిరాన్ని ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ... పాకిస్థాన్‌లో స్థావరాలు ఏర్పరుచుకున్న ఉగ్రవాదులు, వారి సూత్రధారులను మట్టుబెట్టిన భారత సాయుధ దళాల సాహసాన్ని ఆయన అభినందించారు. భారత్‌పై కన్నువేసే ధైర్యం చేసిన ఎవరైనా తీవ్ర పరిణామాలు ఎదుర్కొక తప్పదని రాజ్ నాథ్ సింగ్ స్పష్టం చేస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో పునరుత్పాదక ఇంధన ఆధారిత విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 300 గిగావాట్ల (GW) మైలురాయిని దాటింది. గత నెల 31 నాటికి ఈ ఘనత నమోదైనట్లు కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2030 నాటికి నిర్దేశించుకున్న 500 గిగావాట్ల లక్ష్యంలో ఇది 60 శాతానికి పైగా ఉండడం విశేషం. ప్రస్తుతం దేశంలో అందుబాటులో ఉన్న మొత్తం విద్యుత్ ఉత్పాదన సామర్థ్యంలో సంప్రదాయేతర ఇంధన వనరుల వాటా 54 శాతానికి పైగా పెరిగిందని మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ హరిత ఇంధన విప్లవం కేవలం పర్యావరణ పరిరక్షణకే పరిమితం కాకుండా.. దేశ పారిశ్రామిక ప్రగతికి, ఇంధన స్వావలంబనకు బలమైన పునాదిగా మారుతోందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

స్కాట్‌లాండ్‌లోని గ్లాస్గోలో ఇటీవల ముగిసిన కామన్వెల్త్ క్రీడల్లో పతకాలు సాధించిన భారతీయ క్రీడాకారులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు భేటీ అయ్యారు. న్యూఢిల్లీలోని తన అధికారిక నివాసంలో విజేతలతో ముచ్చటించిన ప్రధానమంత్రి.. వారి ప్రతిభను కొనియాడి, హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా ఒక వీడియో సందేశాన్ని పంచుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

అమెరికా వేదికగా జరుగుతున్న ప్రపంచ అండర్-20 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ఈరోజు మరో మూడు పతకాలు గెలుచుకుంది. భారత అథ్లెట్లు వసంత్ కుమార్ మేఘవాల్ రజతం, షానవాజ్ ఖాన్ కాంస్య పతకాలతో మెరిశారు. పురుషుల హైజంప్ పోటీల్లో వసంత్ కుమార్ మేఘవాల్ రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. అలాగే, పురుషుల లాంగ్ జంప్ విభాగంలో షానవాజ్ ఖాన్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నారు. అంతకుముందు జావెలిన్ త్రో విభాగంలో ఆశిశ్ యాదవ్ రజత పతకం గెలుపొందారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో రేపు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండి) వెల్లడించింది. ఈ మేరకు `ఆరెంజ్ అలెర్ట్` జారీ చేసింది. వీటితో పాటు రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, అసోం, మేఘాలయ రాష్ట్రాల్లో రేపటి వరకు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రానున్న రెండు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, బీహార్, జమ్మూకశ్మీర్, ఒడిశా, అండమాన్ నికోబార్ దీవుల్లో ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన వర్షాలు కొనసాగుతాయని ఐఎండి పేర్కొంది.

==========================

అండమాన్ నికోబార్ దీవుల పర్యటనలో భాగంగా ఉపరాష్ట్రపతి సీ పీ రాధాకృష్ణన్ ఈరోజు చారిత్రాత్మక నేతాజీ సుభాష్ చంద్రబోస్ దీవిని సందర్శించారు. అక్కడ ఉన్న పలు చారిత్రక ప్రాంతాలను ఆయన స్వయంగా వీక్షించారు. 1943 డిసెంబర్‌లో అండమాన్ దీవుల పర్యటన సందర్భంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ విడిది చేసిన భవనాన్ని ఉపరాష్ట్రపతి పరిశీలించారు. అనంతరం అక్కడి సైనిక బ్యారక్లు, గన్ పాయింట్ ప్రాంతం, స్మృతి మ్యూజియంలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆ దీవుల చరిత్రతో పాటు అభివృద్ధి ప్రణాళికల గురించి అధికారులు ఉపరాష్ట్రపతికి వివరాలను అందించారు.

==========================

చారిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న పోరాట యోధులకు ఉప రాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. మహాత్మా గాంధీ పిలుపునిచ్చిన 'డు ఆర్ డై' నినాదంతో స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది ఉద్యమ స్ఫూర్తితో పోరాడారని ఉప రాష్ట్రపతి తెలిపారు.

==========================

==========================